

# షరా

## గోపీచంద్

ఆమనిషిని ఎక్కడో చూశానని పించింది. కాని ఎంత ఆలోచించినా జ్ఞాపకం రాలేదు. కృష్ణలంకలో నాకు ఎవ్వరితోనూ పరిచయం లేదు. నేను ఎన్నడూ ఆ లంకలో అడుగుపెట్టి కూడా ఎరగను.

మా ఊరు బెజవాడ దగ్గరదే అయినా నేను ఏడెనిమిది సంవత్సరాలనుంచీ మద్రాసులోనేవుంటున్నాను. ఈ ప్రాంతాలకు రాలేదు. ఇటీవలవొచ్చిన గాలివానకు పంటలన్నీ పాడైనయ్యని తెలుసుకొని పొలాలు చూసుకువెళ్దామని వొచ్చాను. గాలివానవల్ల నిజంగా అపారమైన నష్టం కలిగింది. నేను ఎరిగింతర్వాత ఇంత నష్టం ఎప్పుడూ జరగలేదు. కవులు వాళ్ళు తమ గింజలు కూడా రావని గోల పెడుతున్నారు. నేను ఏమిచెయ్యగలను? మళ్ళీ మద్రాసు వెళ్దామని బయలుదేరి, ఎలాగూ వచ్చాంగదా అని, బెజవాడలో వున్న నా మిత్రుణ్ణి వొకణ్ణి చూచిపోదా

మని బెజవాడలో దిగాను. అతను గాలి వానకు నష్టపడ్డవారికి సహాయం చేసే ప్రయత్నంలో వుండి ''రేపువెళ్లొచ్చులే'' అంటే_ఆ నాటికి ఆగిపోయాను.


ఆ సాయంత్రం బెజవాడ లంకలో నష్టపడ్డ బీదజనానికి వాసాలూ, తాటాకులూ పంచిపెడుతూ నన్నుకూడా రమ్మంటే నేనూ వెళ్లాను. శరణార్థుల్లో కనుపించాడు ఆమనిషి. నన్ను చూచి కొంచెం బెరుకుపడ్డట్టుకూడా అనిపించింది నాకు. నిజంగా ఆ మనిషిని నేను ఎక్కడో చూశాను. అందులో సందేహం లేదు. కాని ఏ సందర్భంలో చూశానో ఎంత ఆలోచించినా నాకు జ్ఞాపకంరాలేదు.

మేము పని పూర్తిచేసుకొని యింటికి వస్తుంటే ఒకరైతు మా వెంట వొచ్చాడు. అతనివల్ల ఆ మనిషి కోటిరెడ్డి మామ అని తెలుసుకున్నప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది. కోటిరెడ్డిని నేను ఎరుగుదును. అతనూ మద్రాసులోనే ఉంటున్నాడు అతని మామనుకూడా ఎరుగుదును. ఒకసారి అతని అత్తవారి ఇంటిదగ్గర ఉండగా అతన్ని చూద్దామని వెళ్లాను. అప్పుడే ఈయన్ని చూశాను. కాని గుర్తు పట్టకపోవటం నా తప్పుకాదు. మనిషి చాలా మారిపోయాడు.

*   *   *

నేను ఎట్లాగూ మద్రాసువెళుతున్నాను గనక అల్లుడి కేమైనా కబుర్లు చెబుతాడేమోనని మర్నాడు ప్రొద్దున్నే లేచి కోటిరెడ్డి మామను చూద్దామని లంకకి ప్రయాణం కట్టాను, ఆ లంకలో వుంటున్నదంతా అలగాజనం. నాకు తెలిసినంతవరకు కోటిరెడ్డిమామ కొద్దిగా వున్నవాడే. కాని ఈమధ్య ఏంజరిగిందో నాకు తెలియదు. స్వగ్రామంలో వున్న ఇల్లూ వాకిలి వొదులుకొని ఇక్కడ ఎందుకు కాపరం పెట్టాడోకూడా నాకు తెలియదు. కోటిరెడ్డికూడా ఈ విషయం నాతో ఎన్నడూ ప్రస్తావించలేదు. అక్కడ వున్నవన్నీ చిన్న చిన్న పూరిగుడిసెలే. ఆ గుడిసెల్లో వొక గుడిసెలోకాపరం వుంటున్నాడు కోటిరెడ్డి మామ. నేను వెళ్ళేటప్పటికి ఆ స్థలంలోనే వున్న మరికొన్ని గుడిసెల్ని బాగుచేయిస్తున్నాడు. నన్నుచూచి కొంచెం తబ్బిబ్బుపడ్డాడు. ఇంటిలోకివెళ్ళి నేను కూర్చోగలందులకు ఒకకుక్కిమంచం తెచ్చాడు. అతన్ని చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత హీనస్థితికి ఎందుకు వొచ్చాడా అని ఆలోచించ బుద్ధి ఐంది. మాటల్లోకి దింపాను. అతను ఆకును అందకుండా పోకనుపొందకుండా జవాబులుచెప్పాడు. తన అల్లుడిసంగతి అడిగాడు. బాగానే వున్నాడని చెప్పాను. నేను అదీ, ఇదీ అడిగా గాని సరైనజవాబులు చెప్పలేదు. చివరికి, ''నేను మద్రాసు వెళ్తున్నాను. మీ అల్లుడికి ఏమైనా కబుర్లు చెపుతారా?'' అని అడిగాను.

''ఇట్లా వుంటున్నామని చెప్పండి''




అన్నాడు. నేను ఆయనదగ్గర సెలవు తీసుకొని మిత్రుని ఇంటికి బయలు దేరాను. దారిలో ముందురోజు కలిసిన రైతు కలిశాడు. అతన్ని అడిగాను, కోటి రెడ్డి మామనుగురించి.

"ఆయన ఆస్థి ఎందుకు పోయింది?" అని అడిగాను.

"ఆస్థి పోవటం ఏమిటండోయ్ !" అన్నాడు ఆ రైతు.

''ఆస్థిపోకపోతే ఈ గుడిసెలో వుండ వలసిన అవుసరం ఏ మొచ్చిందీ?" అన్నాను.

"అదా అండి... అట్లా అడగండి" అన్నాడు రైతు. అని ఈ విధంగా చెప్పాడు; "ఏమండోయ్ నాదీ ఆయన్దీ వొకఊరే... తెలుసా అండి... నాకా యన సంగతి బాగాతెలుసు...ఆస్తిపోయి రాలేదు...''

''మరెందు కొచ్చాడు ?''

"సంపాదించటానికి వొచ్చాడు. అక్కడ ఇల్లూ, పొలం అమ్ముకొని వడ్డీకిచ్చి ఈ లంకలో స్థలాలు చౌగ్గా వున్నాయనీ, తొందరలో ధరలు పెరుగు తాయనీ తెలుసుకొని. ఇక్కడ స్థలం కొన్నాడు... రేపీస్థలం అమ్ముతాడు... ఇంకొకచోట కొంటాడు... ఆయన కేమండీ... చూశారా... ఈ స్థలం కొన్నాడా... కొని ఊరికేవుంటే యేమొ స్తుందని నాలుగు గుడిసెలు వేయించి అద్దెకిస్తున్నాడు...కాని గాలివానవొచ్చిం రోజే గమ్మత్తంటే గమ్మత్తు..." అని నవ్వటం మొదలుపెట్టాడు.

కారణం తెలియకపోయినా, అతను నవ్వుతుంటే నాకూ నవ్వు వొచ్చింది. "ఏం జరిగిందేమిటి?" అని అడిగాను.

"అంతకు ముందు మూడురోజుల నుంచీ గాలివాన కొడుతూ వుంది. ఆరోజు మరీ ఎక్కువైంది. లంకలో వుంటానికి వీల్లేక అంతా ఊళ్లోకి వెళ్ళాను తలదాచు కోటానికి. ఈయన్ని రమ్మంటే రాడే 'ఈ ఇళ్లు నన్ను కాపాడినై... కష్ట కాలంలో వాటిని విడిచిపెట్టి రాను' అంటూ కూర్చున్నాడు...ఆయన భార్య కూడా ఆయనకు తగ్గదే దొరికింది. 'వొచ్చిన గాలివాన పోక వుంటుందా... వెళ్ళటంరావటం... ఇదంతా ఎందుకు?' అంటూ కూర్చుంది...వొచ్చిన గాలీవాన ఎట్టాగూ పోతుందట!" మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

"చివరికి ఏమైంది?" అని అడిగాను.


"ఏమవుతుంది? వాళ్ళు రానంటే మాత్రం మేము ఊరుకుంటామా? వాళ్ళ సంగతి దేవుడెరుగు. వాళ్ళకొక చంటిబిడ్డ వుంది. ఆ చంటిబిడ్డ జోరున తడుస్తుంటే ఎట్లా చూస్తూ ఊరుకోవటం... బలవంతంగా తీసుకువెళ్ళాం... అదుగో చూడండి ఆ కట్టెల అడితీ... అది దాటి రానంటాడే... తన ఇళ్ళకు వీలైనంత దగ్గర్లో వుండాలని ఆశ! ఆ రాత్రి ఆ కట్టెల అడితీలో పెట్టాం... మమ్మల్ని నానా మాటలూ అంటూ కూర్చున్నాడు. ఆయన అల్లుడి తరపు బంధువులు వూళ్ళో వున్నారు. వాళ్ళు వొచ్చి తమ యింటికి రమ్మని పిలిచారు. ఊహు, ఎంత చెప్పినా వినడు... పైగా 'మీరు ఆనాడు అట్లా చేశారు. ఈనాడు యిటాచేశారు. నా సంగతి మీకు పట్టిందా, ఈ కష్టంలో నన్నుచూసి నవ్వాలని వచ్చారు' అని మండిపడిపంపించాడు. ఎట్లాగో తెల్లవారే దాకా ప్రాణాలు బిగబట్టుకు కూర్చుని తెల్లవారి మళ్ళీ భార్యాసమేతంగా లంక ప్రవేశించాడు. అప్పటికి గాలివాన కొంచం తగ్గిందిగానీ యింకా యెవ్వరూ బయటకు రావటంలేదు. పాపం పడిపోయిన యిళ్ళని చూడలేకపోయాడు. వాటిని మళ్ళీ మామూలు ఆకారంలో చూస్తేగాని వుండలేకపోయాడు. భార్యనీ చంటిపిల్లనీ పడని మొండిగోడలకు నాలుగుఆకులు కప్పి, దాని క్రిందపెట్టి ఇళ్లు నిలబెట్టటానికి పూనుకున్నాడు..." ఈ విధంగా ఆ రైతు చెప్పి చెప్పి, "పాపం అతనికి ఇప్పుడు వొక్కటే దిగులు" అని పెదవి విరిచాడు.

"ఏమిటది?" అని అడిగాను.

"ఏముంది, పాపం! మొదట్లో తాను ఉంటానికి వొక గుడిసె వేయించాడు. అద్దెలవాళ్ళ పోరుపడలేక ఆ గుడిసెలో సగం అయిదు రూపాయలకు అద్దెకిచ్చి మిగిలిన సగంలో తాను వుండేవాడు. అప్పటికీ అద్దెలవాళ్ళ పోరు తగ్గలేదు. అందుకని ఆ సగం కూడా అద్దెకిచ్చి పంచలో వుండేవాడు. ఆ పంచకూడా



గుడి




అద్దెకివ్వాల్సి వొచ్చింది. అందుకని మరొక గుడిసె వేయాల్సివొచ్చింది. కాని ఆ గుడిసె పనీ ఇంతే అయింది. ఎన్ని గుడిసెలు వేయించినా, తాను కొంత స్థలం ఆక్రమించుకోవాల్సి రావటం, అంతమేరా అద్దెడబ్బులు దండగ అవటం జరుగుతూవుంది... ఈ సమస్య ఎట్లా తీరుతుందా అని అతను రాత్రింబగళ్లూ దిగులుపడుతూ ఉంటాడు" అని చెప్పి పెద్దపెట్టున నవ్వాడు.

నాకూ నవ్వు వొచ్చింది. ఆ రైతు చెపుతున్న పద్ధతి నాకు నవ్వు తెప్పించింది కాని లోపల కోటిరెడ్డి మామ ఎందుకు మారాడా అని ఆందోళన కలగకపోలేదు. మొదట్లోనేను చూచినప్పుడు అతను చాలా మర్యాదస్తుడుగా కనిపించాడు. ఊళ్లో గౌరవంగా వుండేవాడు. తాను తినేవాడు, ఇతరులకు పెట్టేవాడు. మర్యాదకు ప్రాకులాడే మనిషనే అనుకున్నాను నేను. ఇంతగా ఎందుకు మారాడో!

* * *

ఆ రాత్రి మెయిల్లోనే నేను మద్రాసు చేరుకున్నాను. నా సొంతపనులు చూచుకుంటూ నాలుగురోజులు కోటిరెడ్డిని కలవలేకపోయాను. అయిదో రోజు సాయంకాలం అతని ఇంటికి వెళ్లాను. అతను ఇంట్లోనే వున్నాడు. ఏదో రాసుకుంటూ వున్నాడు. కాసేపు అదీ ఇదీ మాట్లాడి అతని మామను చూశాననీ, గాలివానకు చాలా నష్టపడ్డాడనీ, ప్రస్తుతం బాగానే వున్నాడనీ మాత్రం చెప్పాను.

అతను కాసేపు ఏమీ మాట్లాడలేదు. నెమ్మదిగా డ్రాయరు తీసి చదవమని వొక కార్డు ఇచ్చాడు. అది అతని మామ కూతురికి వ్రాసిన ఉత్తరం. అందులో ఇల్లా వుంది.

''బిడ్డా,

నీవు వ్రాసిన వుత్తరం అందినది. గాలివానవల్ల నష్టపడ్డా, భగవంతుని కృపవల్ల అట్టే నష్టం లేకుండానే తేరుకున్నాము. గాలివాన తగ్గిన మర్నాడే, ఎవ్వరూ ధైర్యం చెయ్యకపోయినా, మీ అమ్మా నేనూ లంకప్రవేశించి ఇళ్లు నిలబెట్టాము. మళ్ళీ వొక్కరొక్కరే అద్దెలవాళ్లు ఇప్పుడిప్పుడే వొస్తున్నారు. ఇళ్లు మళ్ళీ వేయించినందుకుగాను నెలకి యిదివరకంటే వొక రూపాయి ఎక్కువ ఇవ్వాలని మీ అమ్మ అడుగుతూ వుంది. నువ్వుమాత్రం డబ్బుదగ్గర జాగ్రత్తగా వుండు. మీఆయన పుస్తకాలకనీ. వాటికనీ అనవసరంగా డబ్బు తగలేస్తూ వుంటాడు. నువ్వు గట్టిపట్టు పట్టి డబ్బు ఖర్చుకాకుండా చూడు. ఆయనకు లేకపోయినా, నువ్వయినా నీ పిల్లలసంగతి చూచుకోవాలిగదా?"

ఈ విధంగా వ్రాసి షరాలో "చంటిబిడ్డ, జలుబుచేసి మరణించిం'' దని తెలియజేశాడు. నేను ఉత్తరం చదివి కోటిరెడ్డివంకకు చూశాను.

''చూశావా, చంటిబిడ్డ మరణించటం ఆయనకంత స్వల్పవిషయంగా కనిపిస్తూ వుంది. ఆ గాలివానలో ఇటూ అటూ తిప్పిఉంటారు, డాక్టరుకి కూడా చూపి ఉండరు. తమఇళ్ళేమో, వడ్డీడబ్బులేమో, అద్దెలేమో తప్ప మరింకొకటి వాళ్ళకు పట్టదాయె. పైగా చెప్పినవాళ్ళు పిచ్చివాళ్ళకింద లెక్క. మొదటినుంచీ ఇలా వుండేవాడు కాదు. కాని పొలం అమ్మి వడ్డీకిచ్చాడూ, అప్పటినుంచీ ఇట్లా తయారయ్యాడు,'' అన్నాడు కోటిరెడ్డి.